తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ బుధవారం 23 - 09 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 6

## దాచారం గ్రామాభివృద్ధిపై..

# ఎమ్మెల్యే సామేల్‌తో సర్పంచ్ సమావేశం



- అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ జ్యోతివీరేశం విన్నపం
- సర్వే నంబర్ 273లో భూసమస్యలు పరిష్కరించాలి
- 22ఏలో పెట్టిన ఇండ్లు, భూములను తొలగించేలా చూడాలి
- త్వరలోనే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని సర్పంచ్ జ్యోతివీరేశంకు ఎమ్మెల్యే హామీ

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మండలం దాచారం గ్రామాభివృద్ధిపై సర్పంచ్ కర్నె జ్యోతివీరేశం గ్రామపంచాయతీ పాలకవర్గంతో కలిసి మంగళవారం హైదరాబాద్‌లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కలిసి సమావేశం నిర్వహించారు. గ్రామంలో చేయాల్సిన అభివృద్ధి పనులు, పలు సమస్య లను ఎమ్మెల్యేకు వివరించారు. పొడిచేడు నుంచి దాచారం వరకు ఉన్న రోడ్డును బీటీ రోడ్డు వేసేందుకు, దాచారం నుంచి ఉప్పలంచ రోడ్డులో ఉన్న కల్వర్టు నిర్మాణంతో పాటు గ్రామంలో పలు సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. సర్వే నంబర్ 273లో ఉన్న భూముల సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా రని, అందులో ఎంత భూమి ఉన్నది, యజ మానులు ఎంత మంది ఉన్నారన్నది సర్వే చేయించి ఫోన్ నంబర్లతో సహా వివరాలు నమోదు చేయించాలని కోరారు. గ్రామంలో 22ఏలో పెట్టిన ఇండ్లను, భూముల వివరాల జాబితాను సిద్ధం చేసి ఆ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం కోసం వెంటనే నిధులు మంజూరు చేయించాలన్నా రు. ఉప్పలంచ మార్గంలో కల్వర్టు నిర్మాణం కోసం ఎమ్మెల్యే వెంటనే డీఈతో మాట్లాడి ప్రతి పాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని, త్వరలోనే అభివృద్ధి పనులన్నింటికీ నిధులు మంజూరు చేయించ డంతో పాటు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సామేల్‌కు సర్పంచ్ జ్యోతివీరేశంతో పాటు పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భీమనబోయిన అవిలయ్య, మాజీ ఉపసర్పంచ్ మంగపండ్ల ధనమ్మ మల్లయ్య, వార్డు సభ్యులు మద్రి విఘ్నేశ్వరి లింగయ్య, ఇట్టబోయిన కృష్ణ, అంతటి సబితాసంతు, సూరారం పరుశరాములు, సూరారం పద్మనర్సయ్య, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు సూరారం నవీన్, గౌరవాధ్యక్షుడు అండెం పిచ్చిరెడ్డి, అడ్వకేట్ అంతటి స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ తాటిపాముల మహేందర్, బాల్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు పొట్టపాక నర్సయ్య, సూరారం అశోక్, సూరారం నవీన్, జగత్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



## మృతుని కుటుంబానికి..

# మిత్ర యూత్ ఆర్థిక సాయం అందజేత



ప్రజావారధి/మోత్కూరు
మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అంగడి బజార్‌కు చెందిన ఎడ్ల శేఖర్ ఇటీవల మృతి చెందగా మంగళవారం మృతుని కుటుంబ సభ్యులను మిత్ర యూత్ సభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా మిత్ర యూత్ ఆధ్వర్యంలో సేకరించిన రూ.20 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, మిత్ర యూత్ గౌరవ సలహాదారుడు పురుగుల వెంకన్న, అధ్యక్షుడు బత్తిని శ్రీశైలం, ఉపాధ్యక్షుడు తాడూరు నరేందర్, ప్రధాన కార్యదర్శి పయ్యముల శ్రీనివాస్, కోశాధికారి ఏల నగేష్, ప్రచార కార్యదర్శులు ఎడ్ల నాగరాజు, ఇక్కిరి నాగరాజు, సభ్యులు కొయ్యలకారి వెంకన్న, గొడిశాల శ్రీను, మసురం వెంకన్న, కట్టేకోల మహేష్, కొయ్యలకారి నవీన్, యాకూబ్ అలీ, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# సాయి చైతన్య పూర్వ విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు





విద్యార్థిని, తల్లిదండ్రులను సన్మానించిన ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి

ప్రజావారధి/మోత్కూరు
మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని సాయి చైతన్య హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థిని సూరారం లిల్లీగ్రేస్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించిందని పాఠశాల ప్రిన్సిపాల్ బి.రవీందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థిని లిల్లీగ్రేస్, తల్లిదండ్రులు అంజమ్మ, యాదయ్యలను ఆయన శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 327వ ర్యాంక్ సాధించడంతో ఎంబీబీఎస్‌లో సీటు లభించిందన్నారు. లిల్లీగ్రేస్ పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకుందని, కష్టపడి చదివి నీట్ పరీక్షలో ర్యాంక్‌తో ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం పట్ల అభినందించారు. విద్యార్థులను తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారని, వారి కష్టాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకుని వారి కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు.

# మంత్రి చేతుల మీదుగా..
# ఉపాధ్యాయుడు సుధాకర్‌కు సన్మానం



ప్రజావారధి/శాలిగౌరారం

శాలిగౌరారంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గొడిశాల సుధాకర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. బుధవారం నల్లగొండలోని లక్ష్మి గార్డెన్‌లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు సుధాకర్‌ను అభినందించారు.

## శాలిగౌరారంలో భాగవత కళారూప ప్రదర్శన

ప్రజావారధి/శాలిగౌరారం



వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అంతరించిపోతున్న భాగవతం కళారూపాలను పరిరక్షించేలా శాలిగౌరారం మార్కెట్ లోని రాజస్థాన్ హోటల్ వద్ద ప్రతిష్టించిన వినాయక విగ్రహం వద్ద కళాకారులు ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. తమ్మిరెడ్డి వెంకటేష్, బొడ్డు సతీష్ సహకారంతో శివగంగా కళ్యాణం కార్యక్రమంలో కళాకారులు పౌరాణిక వేషధారణలో భాగవత కథలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కళారూపాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో వివిధ వేశాధరణలో డెంకల లక్ష్మయ్య, గుండ్లపల్లి వెంకన్న, బొడ్డు అంజయ్య, బల్లెం లక్ష్మయ్య, చీమల యాదయ్య, కంది సత్తయ్య, బట్టపెద బిక్షం, మక్క బుచ్చి రాములు, వడ్లకొండ నర్సయ్య, అనుముల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
23 - 09 - 2026

# బాలల హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



**ప్రజావారధి/శాలిగౌరారం**

బాలల హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బాలల పరిరక్షణ యూనిట్ జిల్లా కౌన్సిలర్ ఎన్.రేవతి అన్నారు. శాలిగౌరారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం, శాలిగౌరారం, వల్లాల మోడల్ స్కూల్లో భేటీ బచావో భేటీ పడావో, మండలస్థాయి పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమని, పోక్సో చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, దత్తత ప్రక్రియ, మిషన్ వాత్సల్య పథకం, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098పై వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ సూపర్ వైజర్లు గుండా సునీత, ఎం.జ్యోతి, ఆశ్రిత బి.ఝాన్సీ, ప్రథమ్ ఫౌండేషన్ అరుణశ్రీ, స్పెషల్ ఆఫీసర్ రమాదేవి, ఎంపీడీవో విజయ్ కుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహ, ఎంఈవో సైదులు, సర్పంచులు, అంగన్ వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్‌పై కళాజాత అవగాహన ప్రదర్శన

**ప్రజావారధి/శాలిగౌరారం**



శాలిగౌరారం మండల కేంద్రంలో మంగళవారం హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు కళా జాత ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఆరోగ్యశాఖ అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ శంకర్ పర్యవేక్షణలో డీపీఎంవో సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శ్రీసాయి ఆర్ట్స్ అకాడమీ, నల్గొండ కళాకారులైన లింగస్వామి, రామకృష్ణ, పాపయ్య కళారూప ప్రదర్శన ద్వారా హెచ్ఐవీ వ్యాప్తి, నివారణపై ప్రజలకు కళా ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవీ ప్రధానంగా 4 కారణాలతో వ్యాపిస్తుందని తెలిపారు: కలుషిత రక్త మార్పిడి ద్వారా, కలుషిత సూదులు, సిరంజిల వాడకం, అసురక్షిత లైంగిక సంబంధాల ద్వారా హెచ్ఐవీ సోకిన తల్లి నుండి పుట్టబోయే బిడ్డకు వ్యాపిస్తుందని వివరించారు. వ్యాధి నివారణకు కండోమ్ తప్పనిసరిగా వాడాలని సూచించారు. హెచ్ఐవీ పై ఏవైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1097 కు కాల్ చేయాలని, బ్రేక్ ఫ్రీ యాప్ ద్వారా సమాచారం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తీగల గోవర్ధన్, జై కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
23 - 09 - 2026

# ఫార్మర్ రిజిస్ట్రీతోనే పంటలకు మద్దతు ధర

- ఫార్మర్ రిజిస్ట్రీతోనే పంటలకు మద్దతు ధర
- ఈనెల 30 వరకు రైతులకు అవకాశం

## వ్యవసాయ విస్తరణ అధికారి అశోక్‌కుమార్




**ప్రజావారధి/ఆత్మకూరు(ఎం)**
ఫార్మర్ రిజిస్ట్రీతోనే రైతులు పండించిన పంటలకు మార్కెట్లో మద్దతు ధర లభిస్తుందని, ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల వ్యవసాయ విస్తరణ అధికారి ముప్పిడి అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం పల్లెర్లలో ఆయన ఫార్మర్ రిజిస్ట్రీలో రైతుల పంటల వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేదీ 13.08.2026 వరకు భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు అవకాశముందని, ప్రభుత్వ పథకాలు, సేవలకు ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా వచ్చే 11 అంకెల యూనిక్ ఫార్మర్ ఐడీ ప్రామాణికమన్నారు. ఈనెల 30 వరకు రైతులంతా తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని చెప్పారు. ఫార్మర్ ఐడీ ద్వారా రైతు, భూమి వివరాలను డిజిటల్‌గా అనుసంధానం చేయడంతో మద్దతు ధరకు పంటల కొనుగోలు, ఎరువుల పంపిణీ, పీఎం-కిసాన్, రైతు భరోసా, వ్యవసాయ యాంత్రికరణ, పంట బీమా, పంట నష్ట పరిహారం తదితర ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సేవల్లో రైతు వివరాల ధ్రువీకరణకు ఉపయోగపడుతుందన్నారు. రైతుల వివరాలు ఒకే డిజిటల్ వ్యవస్థలో నమోదు కావడంతో వ్యవసాయ శాఖ సేవలను మరింత సులభంగా, సమర్థవంతంగా అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. రైతులు మీ సేవా కేంద్రం, కామన్ సర్వీస్ సెంటర్ లేదా రైతువేదికను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నమోదు సమయంలో రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ తదితర వివరాలను వెంట తీసుకెళ్లాలని కోరారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
23 - 09 - 2026

# హరీష్ రావును విమర్శిస్తే ఖబర్దార్

## డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి

- ముందు సంస్కారం నేర్చుకో అయిలయ్య
- కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు



ప్రజావారధి/ఆలేరు

తెలంగాణలో కాంగ్రెస్ రావడానికి 420 హామీలిచ్చి ఓట్లు దండుకొని గెలిచి గద్దెనెక్కినాక ఏ ఒక్క హామీని నెరవేర్చకపోవడాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు 24 గంటల కరెంటు ఇచ్చిన మాట నిజం కాదా అని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలన బాలేదని మోటకొండూరు హరీష్ రావు సమక్షంలో కొన్ని వందల మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారన్నారు. ఆలేరు నియోజకవర్గంలో ఏ గ్రామంలో కూడా వ్యవసాయానికి 10 గంటలు కూడా కరెంట్ ఇవ్వడం లేదన్నారు. వ్యవసాయానికి కరెంట్, రైతు సమస్యలపై హరీష్‌రావు మాట్లాడితే ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తప్పుడు మాటలు మాట్లాడుతూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సంస్కారంతో మాట్లాడితే బాగుంటుందని, హరీష్‌రావుపై చిల్లర మాటలు మాట్లాడితే ఖబర్దార్ అని హెచ్చరించారు. ఆలేరు నియోజకవర్గంలో ఏ గ్రామానికైనా వెళదామని, వ్యవసాయానికి ఏడు గంటలు కరెంట్ ఇవ్వడం లేదని, దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ చేశారు. కేసీఆర్ 24 గంటల కరెంటు ఇవ్వడంతో రైతులు అధికంగా పంట సాగు చేశారన్నారు. ఇప్పుడు కరెంటు ఇవ్వమంటే వర్షాలు రావడం లేదని కుంటి సాకులు చెబుతున్నారన్నారు. నియోజకవర్గంలో రైతులు కాంగ్రెస్ పాలనతో అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు పంటలకు రైతుబంధు ఎగ్గొట్టారన్నారు. రైతు బీమాను రద్దు చేశారని, ఎరువుల కోసం రైతులు షాపుల ముందు పడిగాపులు పడాల్సి వస్తుందన్నారు. వ్యవసాయానికి కరెంట్ సరఫరాపై నీ సొంత గ్రామమైన సైదాపురం గ్రామానికి వెళ్లే రైతులను అడుగుదామన్నారు. ఉదయం సరఫరా చేసే కరెంట్ కూడా సక్రమంగా రావడం లేదని, అందులో సాయంత్రం నాలుగు గంటలు బంద్ పెడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదని.. రాక్షస పాలన అన్నారు. గతంలో యూరియా తీసుకోవాలంటే రైతులు ఆటో డ్రైవర్లకు డబ్బులిస్తే ఇంటికి తెచ్చి వేసేవారని, ఇప్పుడు షాపుల ముందు బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. హరీష్ రావుపై తప్పుడు మాటలు మాట్లాడితే సహించమని, ఎమ్మెల్యే తన గౌరవాన్ని కాపాడుకోవాలన్నారు.